క్లుప్తంగా

క్రీడాప్రాంగణం పరిశీలన



బాల్కొండ : మండలంలోని బోదేపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని సోమవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. క్రీడా ప్రాంగణం స్థలానికి వెంటనే హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. త్వరలోనే క్రీడా పరికరాలు సరఫరా అవుతాయన్నారు. సర్పంచ్ రవి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



వర్ని: మండలంలోని పైడిమల్ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ కన్నా ప్రభ దేవేందర్ సోమవారం భూమి పూజచేసి పనులను ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5లక్షలతో నిర్మాణం చేపట్టనున్న రోడ్డు పనులకు సర్పంచ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాశీరాం నాయకులు వడ్ల బాలరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



వేల్పూర్ : వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లింబారెడ్డి, ఎంపీటీసీలు గుడాల గంగాధర్, నోముల గంగారెడ్డి, నాయకులు సంజీవ్‌రెడ్డి, భైరి రవి, రవి, సుమన్ పాల్గొన్నారు.

భిక్ష ఏర్పాటు చేసిన మైనారిటీ సర్పంచ్



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ సర్పంచ్ ఎఖార్‌పాష సోమవారం గ్రామంలోని హన్మాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా హన్మాన్ స్వాములకు వడ్డించారు. నాలుగేళ్లుగా ఆయన హన్మాన్ స్వాములకు భిక్షను ఏర్పాటు చేస్తున్నారు.

బదిలీలు సహజం




రెంజల్(బోధన్) : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని పనిచేసిన చోటు స్థానికుల గుర్తింపు పొందడం ముఖ్యమని బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్ అన్నారు. రెంజల్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ నిజామాబాద్ రూరల్ టౌన్‌కు బదిలీ అయ్యారు. సోమవారం స్టేషన్‌లో కానిస్టేబుల్‌కు సన్మానం నిర్వహించారు.

పీఈటీ సువర్ణకు సన్మానం



భీమ్‌గల్ : ఇటీవల జాతీయస్థాయిలో హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో భీమ్‌గల్ కస్తూర్బా బాలికల విద్యాలయం నుంచి 27 మంది విద్యార్థినులు పాల్గొనగా వారందరు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పథకాలు సాధించారు. పతకాలు సాధించేలా కృషి చేసిన ఉత్తమ పీఈటీ పురస్తు సువర్ణను మంత్రి ప్రశాంత్‌రెడ్డి సోమవారం సన్మానించారు. విద్యార్థినిలకు సర్టిఫికెట్లు అందజేశారు. జెడ్పీ చైర్మెన్ విఠల్ రావ్, ఎంపీపీ మహేష్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

పాఠశాలలో స్టేజీ నిర్మాణానికి చేయూత



కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్టేజీ షెడ్ నిర్మాణం కోసం స్థానిక వారియర్ యూత్ ఎస్ఎస్‌సీ 2013–14 బ్యాచ్ రూ. 80 వేలు ఆర్థికసాయం చేసింది. షెడ్డు నిర్మాణం పూర్తి కాగా, సోమవారం సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ జ్యోతి చేతుల మీదుగా ప్రారంభించారు.

మా ఊరి దేవుడు..అందాల రాముడు..

- ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో కోదండ రామాలయం
- శ్రీరామ నవమికి ఘనంగా ఏర్పాట్లు
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేసిన గ్రామస్తులు



ముప్కాల్‌లో విద్యుద్దీపాలతో అలంకరించిన కోదండ రామాలయం

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామ ప్రజలు ఆరాధ్య దైవంగా కొలుస్తున్న శ్రీరామున్ని అందాల రాముడు.. మా ఊరు దేవుడు అంటు గ్రామస్తులు కొంగు బంగారంగా కొలుస్తున్నారు. శ్రీ కోదండ రామాలయం శ్రీరామ నవమి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ముస్తాబైంది. శ్రీరామ నవమి ఉత్సవాలను మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ అర్చకులు నాగారాజు తెలిపారు. మంగళవారం నుంచి ఈ నెల శుక్రవారం వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరాముని కృపకు పాత్రులు కావాలన్నారు.

పచ్చని గార్డెన్‌లో..

శ్రీరామాలయం పచ్చని గార్డెన్‌లో విద్యుద్దీపాలను ఏర్పాట్లను చేశారు. గర్భగుడిలో సీతారామ లక్ష్మణుల మూల విరాట్లను అందంగా అలంకరించారు. ఆలయం ప్రాంగాణం పూర్తిగా పచ్చగడ్డితో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. ఆలయానికి వచ్చే భక్తుల కోసం వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను చేశారు.

26ఏళ్లుగా మాలధారణ..

గ్రామానికి చెందిన భక్తులు 26 ఏళ్ల శ్రీరామా మాల ధరిస్తున్నారు. ప్రస్తుత ఏడాది కూడా భక్తులు అధిక సంఖ్యలో మాలాధరణ చేపట్టారు. నిత్య పూజలతో సీతారామ లక్ష్మణుల సేవలో తరిస్తున్నారు. స్వాముల భజన కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగుతుంది.



సీతారామలక్ష్మణ మూర్తులు

చలువ పందిళ్ల ప్రత్యేకత..

రెండో భద్రాద్రిగా పేరుగాంచిన రెంజర్ల కోదండ రామాలయంలో చలువ పందిళ్ల ప్రత్యేకత ఉంది. ఆలయ ప్రాంగాణంలో చలువ పందిళ్లు వేసి భక్తులు సేద తీరుటకు అవకాశం కల్పిస్తున్నారు. గతంలో చలువ పందిళ్లు కాదని టెంట్లు వేస్తే వేసిన గంటలోనే నేల కొరిగాయని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు..

శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహిస్తారు. తెల్లవారు అన్నదానం చేపడుతారు. చుట్టుపక్కల గ్రామాలైన వెంచిర్యాల్, వెల్కటూర్, నాగంపేట్, శెట్‌పల్లి, ధర్మోరా, వన్నెల్(బి) గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

ఘనంగా నిర్వహిస్తాం..

శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా ప్రతి ఏడాది నిర్వహిస్తాం, అందు కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి. – నాగరాజు, ఆలయ అర్చకుడు

అటెన్షన్ ప్లీజ్..

లీకేజీని అరికట్టండి..



పట్టణంలోని ప్రధాన రహదారిపై పారుతున్న లీకేజీ నీరు

బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీ ప్రధాన రహదారిపై మున్సిపల్ పైప్‌లైన్ వాల్ లీకేజీ వల్ల ప్రతిరోజు తాగునీరు వృథాగా పోతుంది. లీకేజీని అరికట్టాలని పలుసార్లు బల్దియా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాల్సిన అవసరం ఉంది.

– బోధన్ టౌన్(బోధన్)

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: శ్రీనివాస్, మున్సిపల్ ఏఈ

ఫోన్ నంబర్ : 83286 61191

చిరు ధాన్యాల్లోనే పోషకాలు



ముప్కాల్‌లో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్, తదితరులు



మోర్తాడ్‌లోని పాలెంలో..

బాల్కొండ : చిరు ధాన్యాల్లోనే పోషకాలు ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి అన్నారు. సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాల్లో లభించే పోషకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో..

మోర్తాడ్ : బాలికలలో రక్తహీనతకు చిరు ధాన్యాలతో చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషా తెలిపారు. సోమవారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా పాలెంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నలందలో గ్రాండ్ ఒలింపియాడ్ పరీక్ష



నలంద హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిదిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో సోమవారం హైదరబాద్ ఈ అభ్యాస్ ఐఐటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రాండ్ ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నలంద ప్రసాద్, ప్రిన్సిపల్ సాగర్, ఐఐటీ ఇన్‌చార్జీ హన్మాండ్లు, సందీప్, అక్షయ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ ముత్తు తెలిపారు. ఈ ఒలింపియాడ్ పరీక్షలో జాతీయ స్థాయిలో రెండవ ప్రైజ్‌ను 6వ తరగతి చదువుతున్న పి.వేద వర్షిణి, మూడవ ప్రైజ్ ఏ.జలనిధి, 4వ ప్రైజ్ 7వ తరగతి ఎస్.గురుప్రీత్, 5వ ప్రైజ్ 9వ తరగతి ఎస్.మనస్విని అందుకున్నారన్నారు. మొత్తంగా 63 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికేట్‌తో పాటు అనేక బహుమతులు గెలుపొందాన్నారు.

మానసిక ఒత్తిడిని తట్టుకోవాలి



ఆయుష్ కిట్లను అందజేస్తున్న మాధవి

ఆర్మూర్‌టౌన్ : నేటి బాలలే రేపటి పౌరులని చిన్న చిన్న మానసిక ఒత్తిడిలను తట్టుకుని బయట పడాలని కాని తమ జీవితాలను బలి తీసుకోవద్దని ఆయుర్వేద వైద్య నిపుణులు మాధవి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం దృష్య్ నేషనల్ ఆయుర్వేదిక మిషన్ వైద్య బృందం ఆయుష్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులలో మేధాశక్తిని పెంపొందించుటకు బ్రాహ్మి గ్రాన్యూల్స్‌ను రాగి పిండితో తయారు చేసిన రాగి లడ్డూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు అవగాహన కల్పించాలి



మాక్లూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

మాక్లూర్: క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలనకు సమాజంలో ఉన్న ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీపీ మాస్త ప్రభాకర్ అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన వారోత్సవాలను పురస్కరించుకోని సోమవారం మండల కేంద్రంలో మండల వైద్యాధికారి సరిత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో సమావేశం హాల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్ మాట్లాడారు.క్షయ లక్షణాలు కన్పించిన వెంటను స్థానిక అంగన్‌వాడీ, ఆశవర్కర్‌ను సంప్రదిస్తే మందుల కిట్టు తెచ్చి ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఆనంద్, టీబీ వ్యాధి నిర్మూలన సూపర్‌వైజర్ సుధాకర్, సోమశేఖర్, లావణ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నందిపేట్ (ఆర్మూర్) : మండల కేంద్రంలో షాపుర్ రోడ్డులో నిర్మించిన అభయాంజనేయ మందిరంలో నూతనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ యజ్ఞం నిర్వహించారు. పరమహంస పరివ్రజక బాలయోగి రాములు మహారాజు, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఆలయ నిర్మాణ దాతలు పోచన్న, అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ముత్యం తదితరులున్నారు.

కేంద్రాన్ని వినియోగించుకోవాలి

బోధన్‌రూరల్(బోధన్) : సన్‌ఫ్లవర్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ అన్నారు. సోమవారం సాలూర మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

బహిరంగ సభను సక్సెస్ చేయండి

ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్‌లో ఈనెల 29న ఇంద్ర పార్కులో జరిగే జన చైతన్యయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ఎడపల్లి(బోధన్) : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం నిర్వహించుకోవడం చట్టరీత్యా నేరమని ఇలాంటి చర్యలకు పాల్పడితే జైలు శిక్ష విధిస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బోధన్ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం ఎడపల్లి ఐకేపీ ఆఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మహిళలకు అవగాహన కల్పించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, పీహెచ్‌సీ డాక్టర్ వినీత్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రాములు తదితరులున్నారు.

జీపీ కార్మికుల ధర్నా

ఎడపల్లి(బోధన్) : ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం మండల పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్మిక యూనియన్ అధ్యక్షులు జంగం గంగాధర్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథనిలో సోమవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగుల బస్ పాస్ మేళా నిర్వహించారు. దివ్యాంగులు ఒరిజినల్, జిరాక్స్ సదరమ్ సర్టిఫికెట్, ఆధారు కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో సంప్రదిస్తే బస్ పాస్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ లింబా రెడ్డి, అధికారులు అశోక్ పాల్గొన్నారు.

విరాళాల అందజేత

నందిపేట్ (ఆర్మూర్) : మండల జీపీ పరిధిలోని విజయనగరంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాముల వారి గుడికి ఆలయ కిరీటాల కోసం రూ. 1,16,000ను మాజీ సర్పంచ్ మచ్చర్ల మల్లు బాయ్ నడిపి సాయన్న శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్‌కు అందజేశారు. కేదారేశ్వర ఆశ్రమ కమిటీ సభ్యులు రామాలయ ఆలయ కమిటీ సభ్యులు విజయ్ సామ్రాట్ ఉన్నారు.

దుకాణాల టెండర్ రద్దు చేయాలి



బోధన్‌టౌన్ : బోధన్ మున్సిపల్ పరిధిలోని స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో నిర్మించిన పండ్ల దుకాణాలను నిబంధనలకు విరుద్ధంగా ఒకే వర్గానికి చెందిన 19మందికి ఇచ్చారని దీనిని రద్దు చేయాలని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు సోమవారం ఫిర్యాదు చేశారు.

నర్సరీలపై దృష్టి సారించాలి

మోర్తాడ్ : నర్సరీల్లో జెర్మినేషన్‌పై దృష్టి సారించాలని భీమ్‌గల్ వ్యవసాయ శాఖ ఏడీఏ, ఏర్గట్ల మండలం ప్రత్యేకాధికారి కాలువ మల్లయ్య సూచించారు. సోమవారం తొర్తి, బట్టాపూర్, తడపాకల్, దోంచంద, తాళ్లరాంపూర్‌ల నర్సరీలను పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులకు తగు సూచనలు అందించారు.

జ్ఞాపకశక్తి పెంచేందుకే హెల్త్ కిట్‌లు



బాలికలకు హెల్త్ కిట్‌లు అందజేస్తున్న మమత

మాక్లూర్ : బాలికల్లో జ్ఞాపక శక్తి పెంపొందించేందుకే హెల్త్ కిట్‌లు అందజేస్తున్నామని ఆయుష్ విభాగం మండల కన్వీనర్ డాక్టర్ మమత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థినులకు హెల్త్ కిట్‌లను అందజేశారు. ఉపసర్పంచ్ అనిత, కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారిని సిహెచ్ ప్రగతి, సవిత, బ్రీజారాణి, జ్యోత్స, కవిత, అనిత, మీరాబాయి, కృష్ణవేణిలు పాల్గొన్నారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి(బోధన్) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుర్వేద వైద్య విభాగం వైద్యుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆయుష్ హెల్త్ కిట్లను పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, ఎంపీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు హెల్త్ కిట్లను అందజేశారు. స్థానిక ఎంపీటీసీ స్రవంతి, జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం సాయిలు, పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యుడు వెంకటేష్,హెల్త్ సూపర్‌వైజర్ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

'అందరి సహకారంతోనే అవార్డు'



రుద్రూర్: జిల్లా స్థాయిలో ఉత్తమ జీపీగా చందూర్ ఎంపిక కావడంలో సఫాయి కార్మికులు, జీపీ సిబ్బంది, అధికారుల సహకారం ఎంతో ఉందని చందూర్ సర్పంచ్ కర్లం సాయరెడ్డి అన్నారు. చందూర్ మండల కేంద్రంలో సోమవారం జీపీ పాలక వర్గంలో ఆధ్వర్యంలో వివిధ శాఖల సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్, ఎంపీడీవో నీలావతి, విండో చైర్మెన్ ప్యారం అశోక్, ఎంపీవో తారాచంద్, జీపీ కార్యదర్శి సాయిలు, ఐకెపి ఏపీఎం పద్మ, ఐసీడీఎస్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



వర్ని: మండలంలోని జలాల్పూర్ గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సోమవారం వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. గ్రామంలో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్లు ,పాఠశాల భవనాల నిర్మాణం పనులను ఎంపీడీవో పరిశీలించారు. పనులను అధికారుల మేజర్మెంట్ ప్రకారం చేయాలని ఎక్కడైనా నాణ్యత లోపిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలోని లింగానికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ కుటుంబసభ్యులు, గుంజిలి గ్రామ సొసైటీ చైర్మన్ రంజిత్‌కుమార్ పాల్గొని స్వామివారికి పాలాభిషేకం చేశారు. గుంజి గ్రామం నుంచి 100మంది భక్తులు రామాలయం, అయ్యప్ప ఆలయం, దుర్గామాత ఆలయాలను సందర్శించారు. అన్నదానం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కిషన్, మీనా చందు తదితరులున్నారు.

యువత భక్తి భావం పెంపొందించుకోవాలి



రుద్రూర్: యువత సన్మార్గంలో పయనిస్తూ భక్తి భావం పెంపొదించుకోవాలని మల్లారం పిట్ల కృష్ణ స్వామి మహరాజ్ అన్నారు. రుద్రూర్ మండలం గైని గుట్ట స్వయం భూబసవేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హనుమాన్ మాలధారణ స్వాములకు మండల భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కృష్ణస్వామి మహరాజ్‌కు భక్తులు పాదపూజ చేశారు సమీప మండలాల హన్మాన్ దీక్ష స్వాములు, బసవేశ్వర భక్తులు హాజరయ్యారు.

సంక్షిప్తం

■ నేడు బోధన్‌లో సత్యాగ్రహ దీక్ష

బోధన్‌టౌన్ : రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం అనర్హత వేటు వేసినందుకు నిరసనగా నేడు బోధన్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉదయం 10గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి సారథ్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నారు.

■ పెద్దమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

నందిపేట్ (ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని సిర్పూర్ గ్రామంలో పెద్దమ్మ గుడి ఆలయ నిర్మాణానికి సోమవారం శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ భూమి పూజ నిర్వహించారు.

■ రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట జీపీ పరిధిలోని విజయనగర్‌లో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మహారాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు పాల్గొన్నారు.

■ వడ్ల కల్లాలు ఏర్పాటు చేయండి

నందిపేట్(ఆర్మూర్): మండలకేంద్రంలో వడ్ల కల్లాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో నాగవర్ధన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎంపీడీవో నాగవర్ధన్ స్పందించి త్వరలోనే నందిపేట్లోనే వడ్లు ఆరబోయడానికి స్థలాన్ని చూస్తానని హామీ ఇచ్చారు.

■ విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత

కమ్మర్‌పల్లి : మండలంలోని కమ్మర్‌పల్లి, హాసాకొత్తూర్, చౌట్‌పల్లి, బషీరాబాద్ పాఠశాలల్లోని విద్యార్థులకు సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. రెణ్నెళ్ల క్రితం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు.

■ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సోమవారం భూమేశ్వర్ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కంట్రోలర్ నగేశ్ ప్రారంభించారు.సాయన్న,నర్సయ్య, రాజీవ్‌గాంధీ ఉన్నారు.

■ నేడు తైబజార్ వేలం పాట

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం తైబజర్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు మున్సిపల్ కమిషనర్ ఆర్మూర్ పేరు మీద రూ. 5లక్షల డీడీతో ఉదయం 11గంటలకు హాజరుకావాలన్నారు.

■ బీజేపీ నాయకులపైనే కేసులేలా..?

భీమ్‌గల్ : సోషల్ మీడియాలో బీజేపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కేసులు ఎందుకు నమోదు చేయట్లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటీ మల్లికార్జున్ రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ భీమ్‌గల్ పట్టణ అధ్యక్షుడు చిన్ని నర్సయ్యపై ఇటీవల కేసు నమోదు చేయగా వివరాలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు బీజేపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పగా వారి పై కూడా కేసులు పెడతామని పోలీసులు పేర్కొన్నారన్నారు.

■ అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు

రుద్రూర్ : రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థుల ప్రదర్శనలు, యోగాసనాలు, సూర్య నమస్కారాలు అలరించాయి. ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ పోచారం ప్రదర్శనలు తిలకించారు.